చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

తెలుగు కావ్యాల్లో అయోధ్య వర్ణన

మర్యాద పురుషోత్తముడు, పితృవాక్య పరిపాలకుడు, నీలమేఘ శ్యాముడు, అమేయకృపావతంసుడైన రామచంద్రుని జన్మస్థలి అయోధ్యలో ఆలయ నిర్మాణం జరుగుతున్న తరుణంలో మన ప్రాచీన తెలుగు కావ్యాల్లో అయోధ్యాపురాన్ని ఎలా వర్ణించారో కావ్యాలు, పద్యాల ద్వారా అవలోకనం చేసుకుందాం.

ఆదికవి వాల్మీకి రామాయణాన్ని మూలంగా, ఆలంబనగా, ఆధారంగా చేసుకుని తెలుగులో యాభైకి పైగా పద్య కావ్యాలు వెలువడ్డాయి. విశ్వనాథ తన రామాయణ కల్పవృక్షంలో వచనంతో అయోధ్య నగరాన్ని వర్ణించారు. 'పండ్రెండు యోజనముల పొడవు, మూడు యోజనముల వెడల్పు గల అయోధ్యాపురి' అని చెప్తూ సీస పద్యం మొదలెట్టి ఎత్తుగీతిలో...

క్రిక్కిరియకుండ ప్రతిమేడ ప్రక్కలందు
బ్రసవితోద్యానములు నామ్రవనములొప్ప
నొడయనికి శాత్రవులకె యయోధ్య గాక
యోధ్యవరపురి శోభ కయోధ్య యయ్యె!

అయోధ్య అంటే శత్రువులకు మాత్రమే జయింప వీలుకానిది కాదు, అక్కడి వీరుల జయింపలేని శోభకు కూడా అయోధ్యే అంటూ చమత్కరించారు.

ప్రముఖ కవయిత్రి మొల్ల తన రామాయణంలోని సీస పద్యంలో...

సరయూ నదీతీర సతత సన్మంగళ
ప్రాభవోన్నత మహా వైభవమ్ము
కనకగోపుర హర్మ్య ఘన కవాటోజ్జ్వల
త్ప్రాకార గోపుర శ్రీకరమ్ము
గజరాజి రథభట గణికాతపత్ర చా
మర కేతు తోరణ మండితమ్ము
ధరణీవధూటికాభరణ విభ్రమరేఖ
దర్శించు మాణిక్య దర్పణమ్ము
భానుకులదీప రాజన్య పట్టభద్ర
భాసి నవరత్నఖచిత సింహాసనమ్ము
నాగ నుతికెక్కు మహిమ ననారతమ్ము
ధర్మనిలయమ్ము మహి నయోధ్యాపురమ్ము

అంటూ సరయూ నదీతీరంలోని బంగారు గోపురాల మేడలు, ఏనుగులు, రథ భట, అశ్వ సంపదలు కలిగి ధరణీ వధూటి తన ఆభరణాలు సరిచూసుకునే దర్పణంలా ఉందని వర్ణిస్తూ సూర్య వంశపు రాజుల నవరత్నఖచిత సింహాసనమై ధర ధర్మనిలయంగా అయోధ్యను భావించారు.

ఉత్తర రామాయణంలో కంకంటి పాపరాజు ఇలా వర్ణించారు...

శ్రీతరుణీవిహార సరసీజ విరాజిత రాజసౌధ సం
ఘాతము, గోపుర స్ఫురిత కాంచన కుంభ విభాభి
భూత ఖ
ద్యోతము, ద్యోతమాన మణితోరణ వార సమేత
మొప్పు సా
కేతము, వాలు సంచలిత కేతు పట ప్రహతాభ్ర
జాతమై

శ్రీలక్ష్మి విహరించు పద్మములలాగా ప్రకాశించు మేడల సమూహం కలది, సూర్యుని కాంతులనే తిరస్కరించగల స్వర్ణమయ గోపుర కాంతులు కలది, మణితోరణాల సమూహాలతో కూడినది, గాలికి కదలాడే ధ్వజ వస్త్రంచేత కట్టబడిన మేఘస మూహం కలదై ఆ సాకేతం ఒప్పుతున్నది అని మనోహరంగా వర్ణించారు కంకంటి పాపరాజు.

గోన బుద్ధారెడ్డి తన రంగనాథ రామాయణం ద్విపద కావ్యంలో...

మణిగోపురంబుల మణితోరణముల- మణికుట్టి
మంబుల మణి గవాక్షముల
గేళికాగృహముల గృతక శైలముల-బాలానిలం
బుల బటహ నాదముల
విమల సౌధంబుల విపణి మార్గముల- గమనీయ
వరముల కమలాకరముల
భానుకులజులకు కులరాజధానియై అయోధ్య
ఒప్పుచున్నది అని వర్ణించారు

రమణీయమూ ప్రౌఢమూ అత్యద్భుతమైన చంపూ రామాయణంలో కవి కార్వేటినగర సంస్థాన విద్వత్కవి శ్రీ ఋగ్వేదికవి వేంకటా చల పతి కవి

మాటల జవరాలి మగనికి నామ భేదంబులే కటకంబు ధరణి సురులు అని రాశారు. మాటల జవరాలు సరస్వతి. ఆమె భర్త బ్రహ్మ, వేద పాండిత్యంలో బ్రహ్మకు ఇక్కడి బ్రాహ్మణులకు తేడా లేదని అంటూ మిగతా త్రివర్ణాల ప్రజలను కూడా వర్ణిస్తూ

వెలయునది సారవాజ గంధిలసమీర, వికసితా
రామ వాటికా విహరమాణ
కీరకంఠకలకలోద్గీత బిరుద రతి వధూజాని
సాకేత రాజధాని అంటూ ప్రౌఢమైన సమాసంతో ముగిస్తారు.

ఇక అయ్యలరాజు రామభద్రుడు తన రామాభ్యుదయం కావ్యంలో అత్యద్భుతమైన వర్ణన గావించారు.

ఖరకరహరిఖురాగత సింధు పంకంబు, గంగా తరంగ శీకరములుడుప
గరికర్ణపుటమరుద్గతి వీక, వినువాక పూవు పుప్పొడి ధూళి బోవ ద్రోయ
డగ్గరి పెంపెక్కు నగ్గల పుంజుక్క, నిగ్గులు ముత్యాల ప్రుగ్గ గాగ
వాలుగా గైవ్రాలు వేలుపు పూబంతి, చాలు మేలైన వాసనలు గ్రుప్ప
నెపుడు జేయని శృంగార మెనయుచుండ
గొమరు మీరిన రత్న శృంగముల యొరపు,

చేపూరి శ్రీరాం
97055 91497

నెట్టుకొని మించు జాళువా గట్టుతోడి, జోడు కోడియ లవ్వీటి మేడగములు

అంటూ అయోధ్యలోని మేడలు ఎంత ఎత్తులో ఉన్నాయో ఆశ్చర్యకరమైన పోలికలతో వర్ణించారు అయ్యలరాజు రామభద్రుడు.

ఆకాశంలో వెళ్తున్న సూర్యుని గుర్రముల గిట్టలతో లేచిన సముద్రపు బురద ఆ మేడలను అంటుకోగా ఆకాశగంగ వాటిని శుభ్రపరిచింది. ఈ నగరంలోని వెడల్పైన ఏనుగు చెవులు ఊపడంతో వచ్చిన గాలి ఆకాశగంగలోని తామరపూల పుప్పొడిని వెడల గొట్టింది. వేలుపు పూబంతిని పారిజాత పుష్పం అంటే అన్వయం చక్కగా కుదురుతుంది. అమరావతిలోని పారిజాత పూల వాసన ఆ మేడల మీద తగులుతున్నది. అలా స్వర్ణతాపడం చేసిన ఆ మేడలు ఆకాశాన్నంటుతున్నాయని అద్భుతంగా వర్ణించారు.

ఇక కళాప్రపూర్ణ జనమంచి శేషాద్రి శర్మ తన శ్రీ ధర్మ సార రామాయణంలో...

శ్రీరమణీనివాసమయి సిద్ధ సుపర్వగణ ప్రపూజ్యమై
చారుతరోన్నత ప్రకట పద్మ సమూహ సమావృతం
బునై
వైరుల కెన్నడైన గెలువంగ జొరంగ నశక్యమై మహో
దారన్యపాల పూతమయి ధాత్రి జెలంగు నయోధ్య
యెంతయున్

అంటూ లక్ష్మీ దేవి నివాసమై దేవతలతో పూజలందుకున్న అందమైన పద్మపుష్ప సమూహాలతో జయింపనశక్యమై అని అయోధ్యను మనోహరంగా వర్ణించారు.

ఇలా తెలుగు పద్య కావ్యాల్లో అయోధ్యను అద్భుతంగా వర్ణించిన సందర్భాలు చాలా ఉన్నాయి. తెలుగు పద్య కవుల సాహితీ పటిమకు, అద్భుతమైన వారి పాండిత్యానికి నిదర్శనమే ఈ వర్ణనలు.

బాల రామయ్యను చూతము రారండి

తేటగీతి పద్యాలు

బాలరాముని సదనాన బలగమంత
జేరి ఉయ్యాల కట్టేరు చెంపగిల్లి
ముద్దు పెట్టేరు ముదముగా పడతులంత
రామ రామంటు సీతమ్మ రాగమీడె

ముద్దులొలుకేడివాని ముద్దు ముఖము
చందమామలా వెలిగేను చక్కగాను
చూసినంతనే శుభమగు చూడరండి
కలుగు పుణ్యఫలములన్ని కంటిముందు

బారసాలను చేసేరు భామలంత
పిండి వంటలు చేసేరు తిండి కొరకు
బాలరాముని సేవకై బారుతీరి
రండి పండుగ సందడి కండి మీరు



ఆటవెలది పద్యాలు

రామనామ మహిమ రమ్యమైనుండును
రామ భజన జేయ రగులు భక్తి
భక్తిలేని బ్రతుకు ముక్తి దరికి పోదు
భక్తపారిజాత బాలరామ

రామ గుణము నేర్య రాజిల్లు జన్మము
రామబాట నడువ రాదు బాధ
రామ బాట వల్ల రామ రాజ్యమువచ్చు
భక్తపారిజాత బాలరామ

తల్లితండ్రి సేవ తనయుడు రాముడు
జేసినాడు నెపుడు చేతులార
జనని జనకులన్న జగతిలో దేవుళ్లు
భక్తపారిజాత బాలరామ

జాదవ్ పుండలిక్‌రావు పాటిల్
94413 33315

22న గిడుగు వర్ధంతి

సవరల అక్షరబ్రహ్మ

గిరిజనులు తమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తారు. తద్వారా తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటున్నారు. ఈ క్రమంలో భాషే వారికి ఆధారభూతంగా నిలుస్తున్నది. భాషకు, సంస్కృతికి అవినాభావ సంబంధం ఉన్నది. భాషా, లిపి లేని కారణంగా అనేక గిరిజన తెగలు అంతరించిపోతున్నాయి.

దేశంలో అనేక మాతృభాషల మనుగడ సన్నగిల్లడంతో మొత్తం 705 తెగలకు గానూ సుమారు 300 భాషలుండగా రోజురోజుకు ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో గిరిజనులు మాట్లాడే సవర భాష వాటిలో ఒకటి. సవర భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి ఎనలేని కృషి చేశారు. ఓవైపు ఆదిమగిరిజనుల సవర భాషపై నిరంతరం పరిశోధనలు చేస్తూ.. సవర లిపిని, నిఘంటువును రూపొందించి, మరోవైపు తెలుగు వాడుక భాషోద్యమానికి విశేష కృషి చేసిన గిడుగు తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. వ్యావహారిక భాషా వ్యాప్తికి కృషి చేసిన గిడుగు.. గ్రాంథిక భాషావాదుల పాలిట 'పిడుగు' అని కీర్తిప్రతిష్టలందుకున్న ఘనాపాటి. తెలుగు భాషకు గిడుగు చేసిన కృషిని గుర్తించి ఆయన జయంతి ఆగష్టు 29ని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకొంటున్నాం.

ఒడిశా సరిహద్దులో పర్లాకిమిడి పట్టణం చుట్టుపక్కల కొండలపై నివసిస్తున్న సవర తెగ గిరిజనులపై గిడుగు దృష్టి పెట్టారు. గిడుగు సవరలపై దృష్టి పెట్టడం వెనుక వారి వెనుకబాటుతనంతో పాటు చారిత్రక నేపథ్యం కూడా దాగున్నది. నాటి రామాయణం, మహాభారతం, వైదిక సూత్రాల్లో సవరల ప్రస్తావన ఉన్నది. అందుకు శబరి నిదర్శనం. శ్రీరాముని సేవకురాలు శబరి కూడా సవర తెగకు చెందిన మహిళే. పూర్వం శబరులు ఆదిమ సవర గిరిజనులు అని ఐతరేయ బ్రాహ్మణంలో ఉన్నది.

సవర గిరిజనుల అభివృద్ధిని కాంక్షించిన గిడుగు వారిని తొలుత చదువుబాట పట్టించాలని సంకల్పించారు. మాతృభాషలోనే వారికి విద్య నేర్పించారు. ప్రత్యేకంగా పాఠశాలలు నెలకొల్పారు. గిడుగు రచించిన సవర వాచకాలు, కథల పుస్తకాలు, పాటల పుస్తకాలు, తెలుగు – సవర, సవర – తెలుగు నిఘంటువులను 1911లో ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం ప్రచురించింది. ఆయన కృషిని కొనియాడుతూ అప్పటి ప్రభుత్వం పారితోషికం ఇవ్వజూపగా.. 'ఆ డబ్బుతో పాఠశాల నెలకొల్పండి' అని ప్రభుత్వాన్ని గిడుగు కోరారు. గిడుగు చేసిన కృషికి గానూ ప్రభుత్వం 1913లో 'రావు సాహెబ్' బిరుదుతో సత్కరించింది.

సవర భాషలో 'ఏ మాన్యువల్ ఆఫ్ సవర లాంగ్వేజెస్' వ్యాకరణాన్ని 1930లో గిడుగు రాశారు. అమెరికాలోని హవాయి విశ్వవిద్యాలయం పాశ్చాత్య భాషావేత్త స్టాన్లీ స్టరోస్టా తన పీహెచ్‌డీ గ్రంథాన్ని గిడుగుకు అంకితమిచ్చారంటే ఆయన సవర భాషాభివృద్ధికి చేసిన కృషిని అర్థం చేసుకోవచ్చు. గిడుగు పరిశోధనలను మెచ్చిన బ్రిటిష్ ప్రభుత్వం 1933లో 'కైజర్ – ఈ – హింద్' బిరుదుతో పాటు బంగారు పతకాన్ని ఇచ్చి సత్కరించింది.

ఆదిమ భాషల పరిరక్షణ చర్యల్లో భాగంగా యునెస్కో 2019ని ఆదివాసీ భాషా సంవత్సరంగా, జూలై 21ని ప్రపంచ ఆదివాసీ భాషా దినోత్సవంగా గుర్తించింది. మాతృభాషల్ని, అంతరిస్తున్న ఆదిమ భాషలను పరిరక్షించాల్సిన బాధ్యత మన పరిపాలకులపై ఉన్నది.

– గుమ్మడి లక్ష్మీ నారాయణ

భక్తి సాహిత్య మకుటంపై మౌళిత్రయం

తెలంగాణ భక్తి సాహిత్య ప్రపంచంలో మౌళిత్రయం స్థానం విశిష్టమైనది. వీరు తమదైన శైలిలో, ఎలాంటి ప్రచారార్భాటాలు లేకుండా తమ సాహిత్య సేద్యాన్ని కొనసాగించారు. ప్రజల నాలుకల మీద వారి సాహిత్యం నిలిచిపోవడం, ఇక్కడి జీవనంలో అది భాగమైపోవడం విశేషం. తెలుగు, సంస్కృత భాషల్లో వీరు ఆణిముత్యాల్లాంటి రచనలు చేశారు. ఇప్పటికీ అవి అజరామరంగా నిలిచిపోయాయి.

మౌళిత్రయంలో మొదటివారు విఠాల చంద్రమౌళి శాస్త్రి, రెండోవారు విఠాల రాజమౌళిశాస్త్రి, మూడోవారు రుక్మాభట్ల విధుమౌళిశాస్త్రి. వీరి సాహిత్య సేవ బహుధా ప్రశంసలు పొందింది. మౌళిత్రయ కవులకు సంగీతసాహిత్యాలు, భక్తి జ్ఞాన వైరాగ్యాలు, ఆధ్యాత్మిక చింతన ఆనువంశికంగా పితృ పితామహుల ద్వారా అబ్బినాయి. పఠన, ప్రవచనం, ప్రబోధకం త్రివేణిలా వారిలో సంగమించాయి. సమాజ సంక్షేమమే లక్ష్యంగా భక్తిమార్గాన్ని ఎంచుకుని పాండితీ గరిమతో కూడిన సాహిత్య సేవ చేశారు. మూఢత్వం నుంచి ప్రజలను భక్తిమార్గం వైపు మళ్లించేందుకు తమవంతు కృషి చేసి చరితార్థులయ్యారు.

ముగ్గురు సోదరులు విఠాల వంశంలో జన్మించినా.. మూడో సోదరుడు దత్తుపోవడంతో ఇంటి పేరు మారింది. అగ్రజుడైన చంద్రమౌళిశాస్త్రి బాసరలో సరస్వతీ అమ్మవారి సన్నిధిలో దీక్ష చేసి అక్షరానుగ్రహం పొందారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో శతావధానం చేసి మెప్పించారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, వరంగల్ తదితర జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి అవధానాలు, హరికథా కాలక్షేపాలు, భజనలతో ప్రజలను ఆయన అలరించేవారు. కావ్యపురాణ పఠనాలతో పాటు వేదాంతాన్ని బోధిస్తూ కవిగా, పండితునిగా, ఉపాసకునిగా విశేష కీర్తిని పొందారు. పండితపామరుల మన్ననలు పొందారు. తన అఖండ ప్రతిభతో శిష్యప్రశిష్యులను ఎందరినో తీర్చిదిద్దారు. సాహితీ సేద్యంలో అమూల్య రత్నాలను పండించారు. గాయత్రీ మాతపై భక్తసంపత్ప్రదాత్రి అనే మకుటంతో మాతృప్రేమ, శీరామునిపై మేలుకో మేలుకో శీరామ మకుటంతో శ్రీరామ ప్రబోధం వెలువరించారు. దేవీ భాగవతంలోని దేవీగీతకు టీకా తాత్పర్యాలు రాసి పుస్తకంగా వేశారు. జ్ఞాన వాసిష్టంలోని ప్రశ్నోత్తర మాలికా శ్లోకాలను శ్రీరామ ప్రబోధం పేరిట అనువదించి గ్రంథరూపంలో వెలువరించారు. విశ్వాసర స్తోత్రాన్ని తెలుగులో గద్య పద్య రూపంలో అనువదించి శివలీల రాశారు. ప్రియతమ శిష్యుడు, అష్టావధాని యామవరం రామశాస్త్రితో కలిసి తొలినాళ్లలో కుమార సల్లాపం అనే గ్రంథం రాశారు. ఇదే శిష్యునితో కలిసి తర్వాతికాలంలో చుంచనకోట త్రిపుర సుందరీ శతకాన్ని రాశారు. ఇందులో చంద్రమౌళిశాస్త్రి మొదటి ఎనిమిది మత్తేభాలను (మత్తేభాష్టకం) రాశారు. ఇవే కాకుండా అనేక భజనలు కూడా రాశారు. మహాలక్ష్మి భజనలు, భువనేశ్వరి బాలా భజనలు, రాధాకృష్ణ దీనాలాపం, వీరాంజనేయ భజన మొదైలనవి పుస్తకాల రూపంలో వచ్చాయి.



మౌళిత్రయంలో రెండోవారైన రాజమౌళిశాస్త్రి సంగీత, సాహిత్యాలను ఔపోసన పట్టారు. రాగయుక్తంగా హరికథ చెప్పడంలో అద్వితీయమైన కీర్తిప్రతిష్ఠలు పొందారు. స్వయంగా బాణీలు కట్టుకుని పాడేవారు. పద్య, గద్య, సంకీర్తనాత్మక హరికథలను స్వయంగా రాసి ప్రదర్శించేవారు. భావానంద రామాయణం మొదలైన హరికథలను ఆయన రాశారు. మెదక్ మండల సాహిత్య పరిషత్తు ద్వారా సాహిత్య కార్యక్రమాలు, అలాగే లెక్కలేనన్ని భాగవత సప్తాహాలు నిర్వహించారు.

మూడోవారైన విధుమౌళిశాస్త్రి భక్తిప్రచారోద్యమంలో విస్తృత కృషి చేశారు. ఆయన స్వయంగా 108 భజన సంఘాలను ప్రారంభించారు. భజన మండళ్ల ద్వారా ఆట, పాటలతో రామ భక్తిని ప్రచారం చేశారు. భజన సంఘాలను ఒకే చోటికి చేర్చి సిద్దిపేటలో 50 వేలమందితో అఖండ నామసంకీర్తనం నిర్వహించి ఖ్యాతి పొందారు. శ్రీరామ పదపరాగ్‌గా పేరొందారు. ఆయన రాసిన భజనలు నేటికీ వినిపిస్తుంటాయి. వీరి రచనల్లో ముఖ్యమైనవి తందనాన గేయకావ్య పరంపరలో రాసిన రామాయణం, భారతం, శివలీలలు, కృష్ణలీలలు, ఉత్తరరామాయణం పుస్తకరూపంలో వచ్చి పండితుల ప్రశంసలు పొందాయి. ఎరుకల నాంచారి అనే బుర్రకథ కూడా పుస్తకరూపంలో వెలువరించారు. గ్రంథస్థం కానటువంటి భజనలు, మంగళహారతులు ఎన్నో ఉన్నాయి.

ఇలా ఒకే కుటుంబం నుంచి ఈ ముగ్గురు సోదరులు భక్తిసాహిత్యంలో విశేష కృషిచేసి ప్రజాభిమానం చూరగొని ఇక్కడి ప్రజల సంస్కృతిలో చిరస్థాయిగా నిలిచిపోయారు. మౌళిత్రయ సాహిత్యంపై జరిపిన పరిశోధనకుగానూ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పార్నంది రామకృష్ణ డాక్టరేట్ పట్టా పొందారు.

- ఎడిటోరియల్ డెస్క్

మన తరం జాషువా ఎండ్లూరి

'ఒక మృదువైన కలం
ఒక పదునైన భావం
ఒక సున్నితమైన హృదయం
ఒక బలమైన భావజాలం
అరమరికలు లేని ప్రేమ స్వరూపం
బుధులు మెచ్చే పాండిత్యం
సుధలు కురిసే సాహిత్య జలపాతం
ఒక అమృతభాండం'


నేడు ఎండ్లూరి జయంతి

అని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు ప్రశంసించిన ప్రముఖ కవి, అధ్యాపకుడు ఆచార్య ఎండ్లూరి సుధాకర్. ఆయన కవిత్వం చదువుతుంటే జాషువా గుర్తొస్తారు. ఆయన వందలాది మంది కవులకు స్ఫూర్తిప్రదాత. నాలుగు దశాబ్దాలపాటు దళిత సాంస్కృతిక విప్లవానికి సారథిగా నడిపించారు. తెలుగు దళిత సాహిత్యంలో ఎండ్లూరి సుధాకర్‌ది విశిష్ట స్వరం. ఆయన కవితా విన్యాసం అందరినీ ఆకర్షించింది.

ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జనవరి 21,1959న నిజామాబాద్‌లోని పాములబస్తీలో జన్మించారు. ఎండ్లూరి దేవయ్య, శాంతాబాయిలకు ప్రథమ సంతానం. వీధి బడిలో ప్రారంభమైన ఆయన చదువు విశ్వవిద్యాలయం వరకు హైదరాబాద్‌లోనే సాగింది. 1985 నుంచి 1990 వరకు తెలుగు పండిట్‌గా విధులు నిర్వర్తించారు. 2004 నుంచి 2011 వరకు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించే 'వాఙ్మయి' సాహిత్య పత్రికకు సహాయ సంపాదకుడిగా, సంపాదకుడిగా వ్యవహరించారు. ఆయన కేంద్ర సాహిత్య అకాడమీ జ్యూరీ, తెలుగు వర్సిటీ కౌన్సిల్, తెలుగు సలహా మండలి, తెలుగు అకాడమీలలో సభ్యులుగా ఉన్నారు. ప్రసిద్ధ హిందీ, ఉర్దూ పద్యాల, లఘు చిత్రాల అనువాదకుడిగా సేవలందించారు. జాషువా జయంతి, వర్ధంతులను ఉద్యమంలా సాగించారు.

'వర్తమానం', 'నల్లద్రాక్ష పందిరి', 'పుష్కర కవితలు', 'ఆటా జనికాంచె..' వంటి కవితాసంపుటులు, 'కావ్య త్రయం', 'కొత్త గబ్బిలం', 'గోసంగి', 'వర్గీకరణీయం' వంటి దళిత దీర్ఘ కావ్యాలు, జాషువా 'నాకథ ' వంటి ఎంఫిల్ పరిశోధన, జాషువా సాహిత్యం– దృక్పథం – పరిణామం– పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథం, 'నా అక్షరమే నా ఆయుధం'– డా.శరణ్‌కుమార్ లింబాలే ఆత్మకథకు అనువాదం, 'మల్లె మొగ్గల గొడుగు' వంటి మాదిగ కథలు రచించారు.

వర్గీకరణీయం, కొత్త గబ్బిలం సంకలనాలు రిజర్వేషన్ల హేతుబద్ధీకరణను బలపరుస్తాయి. మాదిగల సామాజిక సాంస్కృతిక జీవితాన్ని కథలుగా ఆయన చెప్పిన తీరు ప్రత్యేకం. మల్లె మొగ్గల గొడుగు కథాసంకలనం విశిష్టమైనది. అలాంటి కథలు ఆయన తప్ప ఎవరూ రాయలేరు. అమెరికా వెళ్లినప్పుడు అక్కడి విశేషాలను, అనుభవాలను 'ఆటా జనికాంచె' కవితా సంకలనంలో వ్యక్తం చేశారు. దేశంలో జరిగే అనేక దుర్మార్గాలను ఆయన ఎప్పటికప్పుడు తన కవితల ద్వారా నిరసించారు.

హిందీ, ఉర్దూ భాషల్లో గల పట్టుతో గజల్, రుబాయీలను తెలుగులోకి అనువదించారు.

'సదా నా హృదయం నిన్నే స్మరిస్తోంది
నీ జ్ఞాపకాల దీపంతో చీకట్లో చరిస్తోంది
తొలినాటి తీపి వలపు తొలగిపోదు నేస్తమా!
నిన్ను తలచుకున్నపుడల్లా నా జన్మ తరిస్తోంది'

అని అన్న కవి సుధాకరే అగ్నినీ కురిపించే కవిత్వాన్ని రాశారు. ప్రతి తల్లిదండ్రులు తమ కూతురికి ఎటువంటి సంబంధం కోరుకుంటారో సాహిత్య పాత్రలతో వర్ణించారు.

'ప్రవరాఖ్యుడు కాకపోయినా
ఫరవాలేదనిపించాలి
కుబేరుడు కాకపోయినా
నగలను కుదువబెట్టనివాడు కావాలి
సత్యవంతుడు కాకపోయినా
నిత్య సంతోషితుడూ,
మా అమ్మాయికి హితుడు, సన్నిహితుడు కావాలి'

('వరాన్వేషణ' పేరిట రాసిన కవితలోని భాగమిది.)

సాయి లోహిత పులపా

తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ఎండ్లూరి సుధాకర్ 2022 జనవరి 28న తుదిశ్వాస విడిచారు. మరణంతో మన ల్నందర్నీ ఆయన విడిచివెళ్లినా 'నవతరం జాషువా'గా అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

ప్రకటన

ఆవిష్కరణ

మూసీ సాహిత్యధార, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ధూళిపాళ అరుణ రాసిన 'జ్ఞాపకాల సంతకం' కవితల సంపుటి ఆవిష్కరణ జరుగనున్నది. 2024, జనవరి 24వ తేదీ బుధవారం రోజున సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా ఆచార్య మసన చెన్నప్ప, ముఖ్య అతిథిగా ఆచార్య అనుమాండ్ల భూమయ్య, కృతి స్వీకర్త టేకులపల్లి గోపాల్‌రెడ్డి, విశిష్ట అతిథిగా ఆచార్య సాగి కమలాకర శర్మ, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ ఎస్.రఘు, డాక్టర్ కొండపల్లి నీహారిణిలు హాజరుకానున్నారు.

- *2024, జనవరి 28 ఆదివారం రోజున సాయంత్రం 5 గంటలకు సోమాజిగుడ ప్రెస్ క్లబ్ (ఏసీ హాల్)లో కల్లూరి భాస్కరం రచించిన 'ఇవీ మన మూలాలు' పుస్తక ఆవిష్కరణ జరుగనున్నది. ఈ కార్యక్రమానికి ఆర్.రవికాంత్ రెడ్డి (డిప్యూటీ ఎడిటర్, ది హిందూ) అధ్యక్షత వహించనున్నారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, కె.రామచంద్రమూర్తి, వాడ్రేవు చిన వీరభద్రుడు, బి.పి.పడాల, తాడి ప్రకాష్, కుప్పిలి పద్మ, శ్రీశైల్‌రెడ్డి పంజుగుల, తదితరులు హాజరుకానున్నారు.*

- బుక్ లీడర్స్ క్లబ్